అత్తాపూర్‌లో సందడిగా బడిబాట


బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అత్తాపూర్: ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రోజారాణి, హేమలత, రంగారెడ్డి ఫిజికల్ డైరెక్టర్ తదితరులు అత్తాపూర్ పాఠశాల పరిసరాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరి్పంచాలని కోరారు. నాణ్యమైన విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు స్కూల్ డ్రెస్‌లు కూడా ఉచితంగా అందిస్తామని వివరించారు. నాణ్యమైన విద్య కోసం తమ పిల్లలందరినీ తప్పక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

వైభవంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి జగదీష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహగౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన బండ్లగూడ క్రీడాకారులు

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో బండ్లగూడకు చెందిన క్రీడాకారుడు సత్తాచాటారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో ఉప్పల్‌లో ఎలైట్ గేమర్స్ గారేజ్, విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తాచాటారు. మెన్స్ డబుల్స్‌లో బుర్ర విఘ్నేష్‌గౌడ్, ఆర్.ప్రణయ్ సాద్విక్, అండర్–19 బాయ్స్ విభాగం విన్నర్స్‌గా బుర్ర విఘ్నేష్‌గౌడ్, జి.శ్రీవర్ధన్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో బండ్లగూడలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చేపల మార్కెట్లు కిటకిట



అత్తాపూర్: మృగశిర కార్తె ప్రారంభ రోజుకు తోడు ఆదివారం కావడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. మాంసాహార ప్రియులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం దాకా చేపల మార్కెట్లు, చికెన్ సెంటర్లు, మటన్ దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. చికెన్, మటన్ కొనుగోలు చేయడంతో పాటు ఏదో ఒక రకమైన చేపలు తీసుకున్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ, జనప్రియ, కేశవనగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలలో 50 కిలోల మాత్రమే విక్రయించేవారు ఈ ఆదివారం క్వింటా నుంచి రెండు క్వింటాళ్ల వరకు విక్రయించారు. చేపల విక్రయదారులు ముందు చూపుతో తమకు తెలిసిన కుటుంబాలకు ఫోన్ చేసి మృగశిర కార్తె స్పెషల్ రోజు సందర్భంగా తమకు ఏ రకం చేపలు , ఎన్ని కిలోలు కావాలంటూ ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రాంనగర్ మార్కెట్, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, చిలుకూరు చెరువుల నుంచి హోల్‌సెల్‌గా తెచ్చుకొని విక్రయించారు.



వ్యర్థాల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్

- కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు
- ముమ్మరంగా జంతు వ్యర్థాల తొలగింపు
- పర్యవేక్షిస్తున్న రాజేంద్రనగర్ డీసీ డాక్టర్ రవికుమార్


జేసీబీతో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: బక్రీద్ పండగ సందర్భంగా ఖుర్బానీ కార్యక్రమాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహిస్తారు. ఖుర్బానీలో భాగంగా పెద్ద ఎత్తున గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను కోసి ఆ మాంసాన్ని పేద ముస్లింలకు దానం చేస్తారు. ఈ నేపథ్యంలో జంతువుల మాంసం వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతాయి. ఆయా వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టింది. అందులో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- జీహెచ్‌ఎంసీ శుక్రవారం రాత్రి చేపట్టిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ సోమవారం రాత్రి వరకు కొనసాగనుంది. పారిశుద్ధ్య కార్యక్రమ నిర్వహణను రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం నుంచి ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ పర్యవేక్షిస్తున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా యానిమల్ వేస్టేజ్‌ల తొలగింపు కోసం ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు, డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేశారు. సర్కిల్ పరిధిలో పని చేస్తున్న సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తున్నారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో జంతువుల వ్యర్థాలను వేసేందుకు 29 వేల ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. ఈ కవర్లను ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఇంటింటి నుంచి స్వీకరిస్తున్నారు. దీంతో సగం మేర రోడ్లపై వేసే వ్యర్థాలను నిర్మూలించినట్లు అయిందని ఉప కమిషనర్ రవికుమార్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వాహణను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 571 మంది చేపడుతున్నారని... వీరికి అదనంగా 55 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి విధులను చేపడుతున్నామన్నారు. జంతువుల వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేకంగా ఐదు జేసీబీలు, 21 డీసీఎంలను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు నిత్యం చెత్తను తరలించే వాహనాలతో ఎప్పటికప్పుడు వ్యర్థాలను శుభ్రం చేస్తున్నామని డీసీ తెలిపారు.
- వ్యర్థాల తొలగింపులో ఆలస్యం కాకుండా సులేమాన్‌నగర్, బండ్లగూడ, కాటేదాన్ ప్రాంతాల్లో తాత్కాలికంగా డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేశామన్నారు. డంప్ యార్డ్‌లలో వ్యర్థాలను పోగు చేసి రాత్రి సమయంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 50 మంది సూపర్‌వైజర్లు వేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ పాయింట్లలో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్నామన్నారు.


బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న సిబ్బంది

- ప్రధాన రహదారులు, ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీ ప్రదేశాల్లో తాత్కాలిక గూడారాలు వేసి జంతువుల విక్రయాలతో పాటు గడ్డి, దాణా తదితర వాటిని విక్రయించారన్నారు. వాటిని ఆదివారం సాయంత్రం తొలగించడంతో పెద్ద ఎత్తున పనులను చేపట్టామన్నారు.
- ప్రధాన రహదారులపై పూర్తిగా వ్యర్థాలను తొలగించినట్లు డీసీ వెల్లడించారు. ప్రజలు సైతం తమకు సహకరించాలని కోరారు. వ్యర్థాలను తమకు అందజేసిన ప్లాస్టిక్ కవర్లలో వేసి అందించాలన్నారు. రోడ్లపై వేస్తే దుర్గంధభరితంగా మారుతుందన్నారు. అది ఇతరులకు అసౌకర్యవంతంగా ఉంటుందనే విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం

గర్వ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


పోటీలను ప్రారంభించిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మణికొండ: క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధించి తద్వారా మానసిక పరిపక్వత, స్నేహసంబంధాలు మెరుగుపడతాయని గ్రేటర్ అలకాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (గర్వ) అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మణికొండ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అనేక టోర్నమెంట్లలో పాల్గొని పతకాలను సాధించారన్నారు. ప్రస్తుతం వారే టోర్నమెంట్‌ను నిర్వహించటం మంచి పరిణామన్నారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, సీతాఫల్‌మండీ, ఆజంపుర, బీహెచ్‌ఈఎల్, చేవెళ్ల తదితర ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారుడు ఎ.లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: చిన్నారుల్లో సృజనాత్మకను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ అత్తాపూర్ నలందనగర్ రోడ్డు నంబర్–13లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్డి ప్లే స్కల్‌ను ఆయన ప్రిన్సిపాల్ శిరీష, మేనేజింగ్ డైరెక్టర్ కిశోర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను ప్రిన్సిపాల్, డైరెక్టర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుగుచెరువు మహేశ్, రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సిమిద్దెల భుజంగా రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


సుచరిత

మణికొండ: వివాహిత అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండీకి చెందిన శ్రీరామ్ యోగిబాబు, తన భార్య సుచరిత(21)తో కలిసి శనివారం మధ్యాహ్నం ఫైనాన్షియల్ జిల్లాలో ఉన్న ప్రిస్టేజ్ స్కైటెక్‌లోని ఆమె కార్యాలయానికి వచ్చారు. అందులో ఆమె ఫ్లోర్ మేనేజర్‌గా పనిచేస్తుంది. తనకు లోపల పని ఉందంటూ భర్తను బయట ఉంచి లోనికి వెళ్లింది. ఎంత సేపు వేచి చూసినా ఆమె రాకపోవటంతో లోనికి వెళ్లి చూడగా ఆమె అక్కడ కనిపించలేదు. పరిసర ప్రాంతాలతో పాటు బంధుమిత్రుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె మెరూన్ రంగు దుస్తులు ధరించిందని, చేతికి స్మార్ట్ వాచ్ ఉందని, ఆమె ఆచూకీ తెలిస్తే నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. దర్యాప్తులో ఉంది.

ఏసీ లేదు.. బస్సు ఆగదు

ఆరునెలలకే ఇదీ ఏసీ బస్‌షెల్టర్ల దుస్థితి


ఐఎస్‌బీ ప్రధానగేటు పక్కన, ఇన్ఫోసిస్ సంస్థ ఎదుట ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్

రాయదుర్గం: నగరంలో ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా నెలకొల్పిన నిరుపయోగంగా మారాయి. ఐటీ కారిడార్‌లో ఏర్పాటు టీఎస్‌ఐఐసీ సంస్థ గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఔటర్ రింగురోడ్డుకు వెళ్లే రహదారిలో రెండు ఏసీ బస్ షెల్టర్లు ఏర్పాటు చేయించారు. రెండు ఏసీ బస్ షెల్టర్లలో ఒకదాన్ని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రధాన గేటుకు చేరువలో, ఇన్ఫోసిస్ సంస్థ ఎదురుగా ఏర్పాటు చేశారు. మరొకటి విప్రో కూడలి దాటిన తర్వాత ఐసీఐసీఐ బ్యాంకు ముందు ఏర్పాటు చేశారు. షెల్టర్లలో ఏసీ ఉండడంతో ఐటీ, ఇతర ఉద్యోగులకు ఉపయుక్తంగా మారాయి. కానీ 6 నెలల వరకు వీటిల్లో ఏసీలను కొనసాగించినా ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడం, బస్సులు కూడా ఇక్కడ ఆగకపోవడంతో వీటి వినియోగం లేకుండా పోయింది. అలాగే తాగు నీటి సౌకర్యం, ఏటీఎం సౌకర్యం కూడా ఉపయోగం లేకుండా పోయింది.


విప్రో సర్కిల్ చేరువలో ఐసీఐసీఐ బ్యాంకు వద్ద ఉన్న బస్‌షెల్టర్

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీ. ధిలోని ఊరపోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతి ఆదివారం ఆలయంలో అమ్మవారికి అష్టోత్తర పూజ, అభిషేకాలు చేస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



మంత్రి శ్రీహరిని కలిసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్


రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మక్తల్ శాసనసభ్యుడు వాకిటి శ్రీహరిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– రాజేంద్రనగర్

బక్రీద్ తర్వాత ఉపాధి!


పొట్టేళ్ల తలలు, కాళ్లు కాల్చి ముక్కలు చేస్తున్న దృశ్యం

శాస్త్రిపురం: బక్రీద్ పండుగతో జంతువులు అమ్మే వ్యాపారులకే కాక ఆరెకటికలకు, మాంసం షాపులవారికి, ఇతరులకు కూడా ఉపాధి కల్పించింది. బక్రీద్ సందర్భంగా 'ఖుర్బానీ' ఇచ్చిన జంతువుల కాళ్లు, తలలను బట్టీస్లు కాల్చి ముక్కలు చేస్తారు. ఇలా చేయడం అందరికీ సాధ్యంకాదు. దీని కోసం కొందరు ప్రత్యేకంగా పనిచేస్తుంటారు. వారిలో చాలా మంది ఆదివారం రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలకు వచ్చి జంతువుల కాళ్లు, తలకాయలు కాల్చే పనిని చేపట్టారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. రెండు రోజులు కష్ట పడితే ఎంతో కొంత సంపాదించవచ్చని పనికి వచ్చినట్లు మహిళలు తెలిపారు.

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ముస్లింలు ఎక్కువగా నివసించే సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లలోని చింతల్‌మెట్ చౌరస్తా, ఎంఎం పహాడీ, నౌనంబర్, వాదియామహ్మద్, సులేమాన్‌నగర్, హసన్‌నగర్, ఇంద్రానగర్, దానమ్మజోపిడీ ప్రాంతాలలో ప్రత్యేకంగా బట్టీలను ఏర్పాటు చేసుకున్నారు. గ్యాస్ బట్టీల సాయంతో పలువురు కాళ్లు, తలకాయలును కాల్చారు. వంద మందికి పైగా కాల్చి, కొట్టే పనులు చేస్తూ కనిపించారు.
- తమ ఇళ్ల వద్దే కాల్చి, కొట్టి ఇస్తుండంతో ముస్లింలు ఆనందం వ్యక్తం చేశారు. ఒక్కో పొట్టేలు తల, నాలుగు కాళ్ల కాల్చేందుకు రూ. 100 నుంచి రూ. 150 వరకు తీసుకున్నారు. తాను గత పదేళ్లుగా బక్రీద్ మరుసటి రోజు మేకలు, గొర్రెల కాళ్లు, తలకాయలు కాల్చే పనిని చేస్తున్నానని నగరానికి చెందిన మణెమ్మ 'సాక్షి' తెలిపారు. తన భర్త, కొడుకు ఈ పనిలో సాయపడతార్నారు. మరికొందరు ఇద్దరు, ముగ్గురుతో జట్టుగా కలసి బట్టీలు పెట్టి వాటిని కాల్చారు. పండగ మూడు రోజులు కలిపి ఒక్కో బట్టీవారు రూ. 8 వేల వరకు సంపాదిస్తామని వ్యాపారులు తెలిపారు.
- కాల్చిన తల, కాళ్లను ముక్కలు (కటింగ్) చేసేందుకు అదనంగా రూ. 20 నుంచి రూ. 30 వెచ్చించాలి. కాలిన తల, కాళ్లను శుభ్రం చేసి ముక్కలు చేసేవారు బట్టీల పక్కనే ఉండి పని చేయడం కనిపించింది.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఎం ఉద్యమిస్తుందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జి.ఎం.గట్టయ్య అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన యాదయ్య, సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జి.కవిత మాట్లాడారు. ముందుగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రోజురోజుకు పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో విఫలం అవుతోందని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల రాయితీలిస్తూ రైతులను మాత్రం వేధిస్తుందన్నారు. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి శ్రమదోపిడీకి గురి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ దగ్గర డబ్బులు లేవు మేము ఏమీ చేయలేమంటూ మాట్లాడడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వం ఏదైనా ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల బారి నుంచి కాపాడి ఇళ్లు లేని పేదలకు ఇవ్వాలన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో చాలా ప్రభుత్వ భూములు గుర్తించామని తెలిపారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు జాజాల రుద్రకుమార్, సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు జి.ఎం.కురుమయ్య, నేతలు మనమ్మ, ఎస్.జంగయ్య, ఎస్.మోహన్, భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాస్, యాదయ్య, శంకర్, ప్రవీణ్, సచిన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాగంటి సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన


మాగంటి గోపీనాథ్‌కు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నివాళి

అత్తాపూర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం హైదర్‌గూడ చౌరాస్తాలో మాగంటి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కొలన్ సుభాష్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్ (చిన్నా), ఆర్.జంగయ్య, కొండమీది హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


మైలార్‌దేవ్‌పల్లిలో...


మైలార్‌దేవ్‌పల్లి: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోమాగంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్‌గుప్తా, జి.రాజు, ఉప్పల్ శ్రీను, కార్తీక్, భాస్కర్, భూదేవి, సరితా, మహేష్, సునీల్, రాజ్‌కుమార్, బొంబాయి రవి, తిమ్మప్ప, మల్లేష్, రాజు, అమతమ్మ, మైసమ్మ, శివారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి వార్త తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆదివారం ఆయన నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు. టీడీపీ హయాం నుంచి బీఆర్‌ఎస్ వరకు గోపీనాథ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

శివరాంపల్లిలో...

రాజేంద్రనగర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ అన్నారు. శివరాంపల్లిలో మాగంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని మాగంటి గోపీనాథ్ నివాసానికి చేరుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


మైలార్‌దేవ్‌పల్లిలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


హైదర్‌గూడలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

జంట హత్యల కేసు దర్యాప్తునకు మరో బృందం

మొత్తం ఏడు బృందాల ఏర్పాటు

రాజేంద్రనగర్: జంట హత్యల కేసు ఛేదించేందుకు రాజేంద్రనగర్ పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిందితుల ఆనవాళ్లు లభించకపోవడంతో దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. హత్య కేసును ఛేదించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఆదివారం మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధ దంపతుల కుటుంబ సభ్యులను ఆదివారం మరోసారి ప్రశ్నించి వివరాలను సేకరించారు. ఆస్తి వివాదాలు, డబ్బు, నగలు తదితర వాటిపై కుటుంబ సభ్యుల నుంచి పలు ప్రశ్నలు అడిగి సమాచారం సేకరించారు. సీసీ టీవీ పుటేజీల్లో లభించిన ఆధారంగా నిందితుల చిత్రాలను కుటుంబ సభ్యులతో పాటు బంధువు, మిత్రులకు చూపించినా ఎలాంటి క్లూ లభించలేదు. దీంతో నిందితుల చిత్రాలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులు వాడిన రెండు ద్విచక్ర వాహనాలు నంబర్ ప్లేట్లు మార్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఒక వాహనం లభించినా ఎలాంటి క్లూ లభించలేదని సమాచారం. పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి క్లూ లభించలేదంటూనే... త్వరలో నిందితులను పట్టుకుంటామని వెల్లడిస్తున్నారు.